క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



క్రాకర్స్ షాపుల పరిశీలనకు వచ్చిన డీఎస్పీ, అధికారులు

పెనుకొండ: నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు క్రాకర్స్ షాపుల యజమానులను హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను డీఎస్పీతో పాటు పలువురు అధికారులు మంగళవారం పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు.

ఎంవీఐ శివశంకర్ సేవలు మరువలేనివి



కార్యక్రమంలో పాల్గొన్న కరుణాసాగర్‌రెడ్డి, శివశంకర్ తదితరులు

హిందూపురం అర్బన్: హిందూపురం ఎంవీఐగా శివశంకర్ సేవలు మరువలేనివని జిల్లా రవాణాశాఖ అధికారి కరుణసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎంవీఐ శివశంకర్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. అనంతపురం రవాణా డిప్యూటీ కమిషనర్ వీర్రాజు, కడప డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు హాజరై శివశంకర్ సేవలను కొనియాడారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

పరిగి: సస్యరక్షణ పద్ధతులకు పాటించడం వల్ల అధిక దిగుబడి సాధించడంతో పాటు అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఏడీఏ సనావుల్లా తెలిపారు. పరిగి, ఊటుకూరుల్లో నిర్వహించిన పొలంబడి కార్యక్రమాల్లో పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని కోతుల గుట్ట, గుర్రప్పకొంగ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రాగి, కంది, మొక్కజొన్న పంటలను ఏఓ తిమ్మప్ప పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంది పంట ఆశాజనకంగా ఉందని తెగుళ్ల సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాండురంగప్ప, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

1 న ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

పెనుకొండ రూరల్: ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని నవంబర్ 1న ఉదయం 10 గంటలకు మంత్రి సవిత చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సీఎస్‌డీటీ ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు.

'జయమంగళి'లోకి రసాయనాలు



జయమంగళి నదిలోకి విడుదలవుతున్న గార్మెంట్ పరిశ్రమ రసాయన వ్యర్థాలు

పరిగి: మండలంలోని కాలువపల్లి వద్ద ఉన్న గార్మెంట్స్ పరిశ్రమకు సంబంధించిన పైప్ లైన్ మంగళవారం పగిలిపోయింది. దీంతో రసాయన వ్యర్థాలు పెద్ద ఎత్తున జయమంగళి నదిలో కలిశాయి. ఆ ప్రాంతమంతా నల్లని నీటి వ్యర్థాలతో కనిపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గార్మెంట్స్ పరిశ్రమ యాజమాన్య నిర్లక్ష్యంతో తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా శాశ్వత నివారణ పనులు చేపట్టడం లేదన్న వాపోతున్నారు. విషయం తెలుసుకున్న కొడిగెనహళ్లి పంచాయతీ సెక్రెటరీ అరుణ మరమ్మతు చేయించారు.

108 వాహనానికి జబ్బు



మడకశిరలోని ఓ పెట్రోల్ బంక్ ఆవరణలో 108 వాహనాన్ని నిలబెట్టిన దృశ్యం

మడకశిర: ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన 108 వాహనానికి జబ్బొచ్చింది. వివరాల్లోకి వెళితే.. వారం రోజుల క్రితం రొళ్ల మండలానికి చెందిన 108 వాహనం మొరాయించింది. మరమ్మతుకు నోచుకోక మడకశిరలోని ఓ పెట్రోల్ బంక్ ఆవరణలో ఓ మూలన ఈ వాహనాన్ని పడేశారు. వాహనానికి వెంటనే రిపేరీ చేయించి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కరెంటు కష్టాలు

మడకశిర నియోజకవర్గంలో విద్యుత్‌శాఖ నిర్వీర్యమైంది. కూటమి ప్రభుత్వం కొలువు దీరినప్పటి నుంచి ఈ పరిస్థితి దాపురించింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ సమస్య వచ్చినా ఎవరికి చెప్పుకోవాలో తెలీక నానా అవస్థలు పడుతున్నారు. కీలకమైన డీఈ స్థానం ఖాళీగా ఉండగా.. మూడు మండలాల్లో ఏఈలు లేక పోవడంతో సమస్యలు తిష్టవేశాయి. దీంతో వినియోగదారులను కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి.

- విద్యుత్‌శాఖను నిర్వీర్యం చేసిన కూటమి సర్కార్
- రెగ్యులర్ డీఈ, ఏఈ పోస్టులు ఖాళీ
- సమస్యలను పట్టించుకునే వారే కరువు
- దిక్కుతోచని స్థితిలో వినియోగదారులు



మడకశిరలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం

మడకశిర: నియోజకవర్గంలో మడకశిర మున్సిపాలిటీ, మడకశిర రూరల్, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాలు మడకశిర విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో 29,296 వ్యవసాయ, 60,334 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారులకు మెరుగైన సేవలందాలంటే పూర్తి స్థాయిలో సిబ్బంది అవసరం. అయితే సిబ్బంది కొరతతో విద్యుత్ సేవల్లో తీవ్ర అంతరాయం కలుగుతోందని వినియోగదారులు వాపోతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా విద్యుత్‌శాఖపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నానా అవస్థలు పడుతున్నారు.

కీలకమైన డీఈ పోస్టు ఖాళీ

నియోజకవర్గస్థాయిలో ట్రాన్స్‌కో డీఈ పోస్టు చాలా కీలకమైనది. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ మెటీరియల్ మంజూరులో డీఈ పాత్రే అధికంగా ఉంటుంది. అలాగే నియోజకవర్గంలో 5 మండలాల ఏఈలతో మాట్లాడుకుని ఎక్కడైనా విద్యుత్ సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత డీఈపైనే ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడ డీఈగా పనిచేస్తున్న ప్రసాద్‌ను బదిలీ చేసింది. నాలుగు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉన్నా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

రెగ్యులర్ ఏఈలు కరువు

నియోజకవర్గంలో 5 మండలాలు ఉండగా... గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాలకు రెగ్యులర్ ఏఈలు లేరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని మండలాల్లో రెగ్యులర్ ఏఈలు ఉండేవారు. దీంతో విద్యుత్ వినియోగదారుల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వంలో బదిలీపై ఏఈలు వెళ్లిపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మడకశిర రూరల్ మండలం, మడకశిర మున్సిపాలిటీకి ఏఈ ఒకరే పని చేయాల్సి ఉంటుంది. ఇంత పెద్ద మండలం, మున్సిపాలిటీకి రెగ్యులర్ ఏఈ లేక పోవడం వినియోగదారులకు శాపంగా మారింది. వర్షాకాలం కావడంతో విద్యుత్ సరఫరాలో ఎక్కువగా అంతరాయం కలుగుతోంది.

మడకశిర నియోజకవర్గం	
జనాభా :	2,60,732
గృహ విద్యుత్ కనెక్షన్లు :	60,334
వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు:	29,296

ట్రాన్స్‌కో డీఈ లేక : మూడు నెలలకు పైగా..
రెగ్యులర్ ఏఈలు లేని మండలాలు : అమరాపురం, గుడిబండ, మడకశిర

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు వాపోతున్నారు. రెగ్యులర్ డీఈ, మడకశిర, అగళి, గుడిబండ మండలాలకు రెగ్యులర్ ఏఈలు లేకపోవడంతో ఆయా మండలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 24 గంటల్లోగా సదరు రైతుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో ఏఈలు లేక పోవడంతో ఈప్రక్రియలో ఆలస్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్లు కావాలన్నా ఎవరిని అడగాలో తెలీడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం మడకశిరకు ఇన్‌చార్జ్ డీఈగా హిందూపురం డీఈ నాగన్న వ్యవహరిస్తున్నారు. ఆయన మడకశిరలో అందుబాటులో ఉండరు. హిందూపురంలో ఉంటారు. వినియోగదారులు పని కోసం హిందూపురం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్ డీఈ, ఏఈలను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇబ్బంది పడుతున్నాం



మడకశిరలో గత కొన్ని నెలల నుంచి రెగ్యులర్ ట్రాన్స్‌కో డీఈ లేరు. దీంతో విద్యుత్ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. అగళి మండలానికి రెగ్యులర్ ఏఈ కూడా లేరు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ పరిస్థితి ఉంది. వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్ డీఈ, ఏఈలను నియమించాలి.

– వన్నేష్, పీబ్యాడిగెర, అగళి మండలం

సమస్యలు పరిష్కరించేవారేరీ?



విద్యుత్‌శాఖలో ఎక్కువగా ఇన్‌చార్జ్ అధికారులు పని చేస్తున్నారు. ఇన్‌చార్జ్ అధికారులతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. గుడిబండ మండలానికి రెగ్యులర్ ఏఈ లేరు. దీంతో విద్యుత్ సమస్యలు పరిష్కారం కావడం లేదు. వెంటనే ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రెగ్యులర్ అధికారులను నియమించి వినియోగదారుల కష్టాలు తీర్చాలి.

– హనుమంతరాయప్ప, శంకరగల్లు, గుడిబండ మండలం

విద్యుత్‌శాఖ నిర్వీర్యం



కూటమి సర్కార్ వచ్చిన నాలుగు నెలల్లోనే విద్యుత్‌శాఖ నిర్వీర్యమైంది. మడకశిరలో రెగ్యులర్ డీఈ, ఏఈలు లేకపోతే విద్యుత్ సమస్యలు ఎలా తీరతాయి? సీఎం చంద్రబాబు విద్యుత్‌శాఖను అస్తవ్యస్తంగా మార్చారు. రెగ్యులర్ అధికారులు లేక విద్యుత్ సమస్యలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వెంటనే రెగ్యులర్ అధికారులను నియమించాలి.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

పకడ్బందీగా నైపుణ్య గణన సర్వే

హిందూపురం/మడకశిర/గుడిబండ / అమరాపురం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి నైపుణ్య గణన సర్వే ఉపయోగపడుతుందని హిందూపురం మున్సిపల్ కమిషనర్ సి.శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో 15 నుంచి 59 సంవత్సరాల్లోపు నిరుద్యోగులకు గుర్తించడానికి ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అలాగే మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లోనూ నైపుణ్య గణనపై మండలంలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.



వివరాలు సేకరిస్తున్న ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీకాంత్

పన్నుల వసూలులో రాజీపడొద్దు

పెనుకొండ: పార్టీలు ఏవైనా రాజకీయాలు పక్కనపెట్టి పెనుకొండ నగర పంచాయతీ అభివృద్ధికి కౌన్సిలర్లు సహకరించాలని మంత్రి సవిత తెలిపారు. పన్నులు, బకాయిల వసూళ్లలో రాజీ పడొద్దని సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ అధ్యక్షతన మంగళవారం నగర పంచాయతీ పాలక వర్గ సమావేశం జరిగింది. మంత్రి మాట్లాడుతూ పన్నుల వసూలులో ఏ రాజకీయ పార్టీల నాయకులు జోక్యం చేసుకోకూడదన్నారు. ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా డ్రైనేజ్ వ్యవస్థను తీర్చిదిద్దుతామని చెప్పారు. అలాగే రోడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పెనుకొండ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తయూబ్, రఘునాథరెడ్డి, సుధాకరరెడ్డి, రామాంజినేయులు, నేమతుల్లా, అంజలి తదితరులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల పట్ల మున్సిపల్ అధికారులు వివక్ష చూపుతున్నారని, ప్రజల చేత ఎన్నుకోబడిన తమను చిన్నచూపు చూస్తే ప్రతిఘటిస్తామని కౌన్సిలర్ తయూబ్.. కమిషనర్ శ్రీనివాసులుకు స్పష్టం చేశారు. ఏ పని చేపట్టినా కౌన్సిలర్లకు తెలియకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

బస్సు సర్వీసు పునరుద్ధరించండి



రొద్దం: సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రొద్దం: గతంలో మడకశిర నుంచి అనంతపురం జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసు నడిచేది. అయితే ఇటీవల రద్దు చేశారు. దాన్ని మళ్లీ పునరుద్ధరించాలని మండల మీట్‌లో సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమాఖ్య భవనంతో వైస్ ఎంపీపీలు రామాంజినమ్మ, హరితాలక్ష్మి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎంపీపీ చంద్రశేఖర్‌కు సంతాపం తెలియజేశారు. కోఆప్షన్ షఫీవుల్లా మాట్లాడుతూ మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనిలో 11 కేవీ విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయని వెంటనే వాటిని మార్చాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు ఫోన్ చేస్తే 108 వాహనం సక్రమంగా రావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పంచదీప ప్రమిదలు

ఆకట్టుకునేలా 'ప్రమిదలు'

హిందూపురం: దీపావళి పండుగ నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రమిదల అమ్మకాలు కొనసాగుతున్నాయి. వివిధ రూపాల్లో తయారు చేసిన ప్రమిదలు అందుబాటులోకి రావడంతో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ప్రమిదలు జత రూ.20కి ఇస్తుండగా, వివిధ ఆకృతుల్లో ఉన్న వాటిని జత రూ.100 నుంచి రూ.150 వరకూ అమ్ముతున్నారు.



పంచ దీపాల మధ్య లక్ష్మీ ప్రతిమ

చేనేతల సంక్షేమానికి కృషి

సోమందేపల్లి: చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారాం తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో చేనేత కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా ముడిసరుకులపై 5 శాతం జీఎస్టీ రాయితీ 100 యూనిట్లు ఉచిత విద్యుత్ పొందవచ్చన్నారు. జిల్లాలో 50 ఏళ్లు దాటిన కార్మికులకు ఇప్పటి వరకు 12,712 రూ.4 వేలు పింఛన్ అందిస్తున్నారని తెలిపారు. ఇంకా అర్హులైన వారు ఉంటే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీ రామకృష్ణ స్థానిక చేనేత కార్మికులు పాల్గొన్నారు.



సోమందేపల్లి: మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారాం

హిందూపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో చేనేత శిక్షణా కేంద్రం వద్ద జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డీ రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎం ప్రారంభం

చిలమత్తూరు: ఎట్టకేలకు మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం సేవలను ప్రారంభించింది. మేనేజర్ అనిల్ కుమార్ మంగళవారం ఏటీఎంను ప్రారంభించారు. సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖాతాదారులకు సూచించారు.

పేర్లు నమోదు చేసుకోండి

మడకశిర: మండలంలోని రైతులు రబీ సీజన్‌లో సాగు చేయడానికి అవసరమైన వేరుశనగ విత్తనం కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ తిమ్మప్ప కోరారు.

ఆరోగ్యకరమైన దినచర్య అలవర్చుకోవాలి

హిందూపురం: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి అనూరాధ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన దిన చర్యను అలవర్చుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి గాయాలు

మడకశిరరూరల్: మండలంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంబాలపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు (98 డీఎస్సీ) వెంకట చంద్రచారికి తీవ్రంగా గాయపడ్డారు. విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఆదిరెడ్డి పాళ్యం సమీపంలో కుక్కలు రావడంతో వాహనం అదుపు తప్పింది. గాయపడిన చంద్రాచారిని స్థానికులు మడకశిర ఆస్పత్రికి తరలించారు.

పండ్ల మొక్కల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

మడకశిర: భూమి ఉన్న ప్రతి రైతు పండ్ల మొక్కల పెంపకం చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వ్యవసాయశాస్త్ర వేత్త వీరభద్రరెడ్డి తెలిపారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో మంగళవారం వెలుగు కార్యాలయంలో పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడకశిర: పట్టణ పరిధిలోని ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న హైవేలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. యారంగాపురం నుంచి ద్విచక్ర వాహనంలో ఇద్దరు వస్తుండగా హైవే మలుపు వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నారు. గాయపడిన వారిని మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైబీ.హళ్లి గ్రామానికి చెందిన హనుమంతు, నాగభూషణ అని చెబుతున్నారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

గుడిబండ: మండల పరిధిలోని మద్దనకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జయప్ప (63) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా సంయుక్త కార్యదర్శి జిబి శివకుమార్, నాయకులతో కలిసి మృతుడు జయప్ప నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రెస్‌కబ్ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: లేపాక్షి పంచాయతీ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి కమిటీ సభ్యులకు దాతలు విరాళాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి రూ.20 వేలు, కొండూరుకు చెందిన సతీష్‌కుమార్ రూ. 15 వేలు, మాజీ సర్పంచ్ శ్రీరామప్ప రూ. 3 వేలు చొప్పున అందజేసారు. అలాగే కంచిసముద్రానికి చెందిన చంద్రశేఖర్ రూ. 10 వేలు, నరసింహారెడ్డి, శ్రీరామిరెడ్డి, గోపాల్ ఒక్కొక్కరు రూ. 5 వేలు చొప్పున అందించారు.

నేడు పంచాయతీ భవనాలకు వేలం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన 7 వాణిజ్య (అద్దె) భవనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అరుణ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉచితంగా బీమా ప్రీమియం

అమరాపురం: మండలంలోని ఉదుగూరు గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యువక సంఘం ఆధ్వర్యంలో కాలనీలోని ఉన్న ప్రతి కుటుంబానికి పోస్టల్‌శాఖ అందిస్తున్న బీమా పాలసీ చేయించారు. మంగళవారం స్థానిక ఫాదర్ విన్సెంట్ విద్యాలయంలో 18 నుంచి నుంచి 65 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారికి ఏడాదికి రూ.549 చెల్లించారు. యువక సంఘం అధ్యక్షుడు దేవరాజు, ఉపాధ్యక్షుడు మల్లేష్, కార్యదర్శి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

మడకశిర: మడకశిర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన బుధవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో జరుగుతుందని కమిషనర్ రంగస్వామి తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ మంగళవారం బెంగళూరు ఎయిర్‌పోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

సోమందేపల్లి: మండలంలోని రంగేపల్లిలో స్థానిక సర్పంచ్ నరసింహులు సోమవారం ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలోని మురుగు నీటి విషయంపై సర్పంచ్ నరసింహులుతో ఉప్పర ఆదినారాయణ వాదనకు దిగి కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు వచ్చినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. దీంతో గ్రామంలో సాక్షులకు డీఎస్పీ విచారించారు.

ద్విచక్ర వాహనం అపహరణ

రొద్దం: మండల కేంద్రంలోని మసీదు వీధిలో నూర్ మహమ్మద్ అనే వ్యక్తి తన ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం (సీబీ షైన్) మంగళవారం అపహరణకు గురైంది. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్యాబ్‌లను వెనక్కిచ్చిన హెచ్‌ఎం

రొళ్ల: మండల పరిధిలోని కాకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులకు గత ప్రభుత్వం బైజూస్ ట్యాబ్‌లను అందజేసిన విషయం తెలిసిందే. అయితే పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు ట్యాబ్‌లకు ఇతర సిమ్ కార్డులను వేసుకొని గేమ్స్, సినిమాలతో పాటు ఇతరాత్ర దృశ్యాలను చూస్తున్నారని ఉపాధ్యాయులు గమనించారు. దీంతో స్కూల్ కమిటీ సభ్యుల అనుమతితో ట్యాబ్‌లను విద్యార్థుల నుంచి వెనక్కి ఇప్పించుకుని పాఠశాలలో భద్రపరచడానికి ప్రయత్నించారు. మంగళవారం విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కాకి వైస్ సర్పంచ్ రాజు, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్ తదితరులు పాఠశాల వద్దను చేరుకొని హెచ్‌ఎంను నిలదీశ సాగారు. ఎక్కడా కూడా గత ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను విద్యార్థుల నుంచి వెనక్కి తీసుకోలేదని , మీరేందుకు విద్యార్థుల నుంచి ట్యాబ్‌లను వెనక్కి తీసుకుంటున్నారని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ శ్రీధర్ పాఠశాల చేరుకుని ట్యాబ్‌లను విద్యార్థులకు ఇప్పించారు.

డ్రిప్‌పై అవగాహన

పెనుకొండ: పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో జిల్లా హార్టికల్చర్ పీడీ సుదర్శన్ ఎంఐ కంపెనీల డీసీఓలకు, కంపెనీ డీలర్లకు డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన కల్పించారు. అప్లికేషన్ ప్రాసెసింగ్, సర్వే బీఓక్యూ ప్రిపరేషన్, రైతుకు అనుగుణంగా డిజైన్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న న్యాయవాదులు

పెనుకొండ: అనంతపురం పట్టణంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 24న ఆత్మహత్య చేసుకున్న రుక్సానా కుటుంబ సభ్యులకు స్థానిక న్యాయవాదులు మంగళవారం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ దొరవారి నాగరాజు, వాల్మీకి శ్రీనివాసులు, శివశర్మ, చంద్రశేఖర్, బాలాజీ, హరీష్, నాగిరెడ్డి, జావిద్, విక్రాంత్ తదితరులు మాట్లాడుతూ లానేస్తం ద్వారా ప్రతి నెల రూ.5వేలు అందేవని, అది నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో రుక్సానా ఆత్మహత్యకు చేసుకోవడం బాధాకరమన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

పెనుకొండ రూరల్: కర్ణాటక నుండి అక్రమంగా తరలిస్తున్న 9 బాక్స్‌ల మద్యాన్ని అధికారులు సీజ్ చేశారు. సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయునిపల్లి క్రాస్ వద్ద కారు, స్కూటీలో మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక చెందిన గిరీష్, సోమందేపల్లికి చెందిన రామాంజినేయులను అదుపులోకి తీసుకున్నారు. పెనుకొండ ఎక్సైజ్ కార్యాలయంలో కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. సీఐ హరి కృష్ణ, ఎస్ఐ ఓం సింహా, సిబ్బంది పాల్గొన్నారు.

కంచిసముద్రంలో...

రొద్దం మండలంలోని కంచిసముద్రం గ్రామంలో గ్రామానికి చెందిన ఎం నరసింహులు అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు సిబ్బందితో దాడులు నిర్వహించారు. 92 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వాల్మీకులు పెద్ద ఎత్తున మహర్షి వాల్మీకి చిత్రపటం వద్ద పూజలు చేసి, వెండి రథంపై ఊరేగించారు.